క్లుప్తంగా

నేడు పల్లెపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

కృత్తివెన్ను:మండల పరిధిలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు తెలిపారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. అన్ని శాఖల అధికారులతో పాటు, వలంటీర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

3న ఆలయాల్లో హుండీల లెక్కింపు

పెడన:పట్టణంలోని పలు దేవాలయాల్లో ఆగస్టు మూడో తేదీన హుండీలను లెక్కించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టీవీవీ మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీ సమేత ఆగస్త్యేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి దేవస్థానాల్లో ఆ రోజు ఉదయం పది గంటలకు దేవదాయశాఖ తనిఖీ అధికారుల సమక్షంలో లెక్కింపు ఉంటుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు శ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం, మధ్యాహ్నం 3 గంటలకు శ్రీపైడమ్మ అమ్మవారి దేవస్థానంలో లెక్కిస్తామని పేర్కొన్నారు. భక్తులు సమర్పించిన కానుకల హుండీలను దేవదాయ శాఖ తనిఖీ అధికారుల పర్యవేక్షణలో చేస్తామన్నారు.

దమ్ము చక్రాల ట్రాక్టర్లను రోడ్లపై నిషేధించాలి




మోపిదేవి:దమ్ము చక్రం కలిగిన ట్రాక్టర్లను రోడ్లపై నిషేధించాలని కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు తహసీల్దార్ కె. నవీన్‌కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. స్పందన కార్యక్రమంలో తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. దమ్ము చక్రం బిగించిన ట్రాక్టర్లు రోడ్డుపై తిరుగుట వల్ల కోట్లాది రూపాయలతో వేసిన రహదార్లు అనతి కాలంలోనే పాడవుతున్నాయని తెలిపారు. దమ్ము చక్రం మధ్యలో 3 అంగుళాలు వెడల్పుతో ఇనుప పట్టీని అమర్చుకుని తారురోడ్లకు జరిగే నష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



అవనిగడ్డ:విజయవాడకు చెందిన న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబుని అద్దంకిలో హత్య చేయడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామప్రసాద్ మాట్లాడుతూ సివిల్ మేటర్ గురించి మాట్లాడుకుందామని రమ్మని చెప్పి ఈ నెల 26న ప్రకాశం జిల్లా అద్దంకిలో న్యాయవాదిని అతి దారుణంగా హత్య చేయడం దారుణమన్నారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన వారిని వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పర్చూరి రాఘవేంద్రరావు, అంది శివరామకృష్ణ, తిమ్మన సుబ్బారావు, తుంగల శ్రీనివాస్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వరి నారుమడుల పరిశీలన



ఘంటసాల:మండల పరిధిలోని చిట్టూర్పు, ఎండకుదురులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీటమునిగి దెబ్బతిన్న వరి నారుమడులు, ఎద పొలాలను ఏవో మురళీకృష్ణ సోమవారం పరిశీలించారు. నీట మునిగిన నారు మడుల్లో ఎప్పటి కప్పుడు నీటిని బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముంపు నుంచి బయట పడిన ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ చల్లాలన్నారు. ఆకులు పచ్చబారిన తరువాత లీటర్ నీటికి 1 గ్రాము కార్బెండిజమ్ (బావిస్టిన్) తగిన మోతాదులో పిచికారీ చేయాలన్నారు. వెద జల్లిన పొలాలకు పది కిలోల యూరియా, పది కిలోల పొటాష్‌ని చల్లడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- ఇచ్చిన హామీలను నెరవేర్చామని ధైర్యంగా చెబుతున్నాం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- విశ్వనాథపల్లిలో 156 ఇళ్లకు తిరిగి పథకాలు వివరించిన ఎమ్మెల్యే



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతున్నాయని.. దీంతో ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని విశ్వనాథపల్లి సచివాలయ పరిధిలో సోమవారం రమేష్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని 156 ఇళ్లకు తిరిగి పథకాల రూపంలో ఒక్కో ఇంటికి ఎంత మేర లబ్ధి చేకూరిందనే విషయాన్ని ఎమ్మెల్యే రమేష్‌బాబు గ్రామస్తులకు స్వయంగా వివరించారు. గత ప్రభుత్వ పాలకులు ఎన్నికలు ముగిసిన తర్వాత ఐదేళ్ల వరకు ప్రజల ముఖం చూసేవారు కాదని, ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చామని తెలిపారు. గడప గడపకు తిరుగుతూ ధైర్యంగా, గర్వంగా చెప్పగలుగుతున్నామని పేర్కొన్నారు. ఎవరి ఇంటికి ఎన్నెన్ని పథకాలు వచ్చాయో ప్రజలకు వివరిస్తున్నామన్నారు. పార్టీలకు, కులమతాలకు తావు లేకుండా అర్హత ఉన్నా ప్రతి ఒక్కరికీ పథకాలను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఇంటి వద్ద ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు.

విమర్శలు మానుకోవాలి....

ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతలు చేసే విమర్శలు మానుకోవాలని రమేష్‌బాబు హితవు పలికారు. అభివృద్ధిని చూసి టీడీపీ, జనసేన పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై కూడా నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సర్పంచ్ యలవర్తి నాంచారయ్య, వైఎస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇంకొల్లు శేషగిరిరావు, నాంచారమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముప్పిరిశెట్టి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు తోట నాంచారమ్మ, బావిశెట్టి పూలేంద్రరరావు, లాల్‌బహదూర్ శాస్త్రి, నేతలు మత్తి సూరిబాబు, చుటూరి వెంకటేశ్వరరావు, చిలకలపూడి బాలకృష్ణ, సచివాలయ కన్వీనర్ హరినాథ్ తదితరులున్నారు.

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి




కౌన్సిల్‌కు హాజరైన సభ్యులు..మాట్లాడుతున్న సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ (ఇన్‌సెట్) కౌన్సిల్ సమావేశంలో సభ్యులు చెబుతున్న విషయాలను వింటున్న చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన:పట్టణంలోని ఆయా వార్డుల్లో సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి స్పష్టం చేశారు. కౌన్సిల్ హాల్లో చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భళ్ల జ్యోత్స్నరాణితో పాటు సీనియర్ కౌన్సిల్ సభ్యులు పిచ్చిక సతీష్‌బాబు, మెట్ల గోపీప్రసాద్, గరికిముక్కు చంద్రబాబులతో పాటు పలువురు కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌గా బాధ్యతలను స్వీకరించిన తరువాత మొట్టమొదటి సారిగా కౌన్సిల్ సమావేశానికి హాజరైన చైర్‌పర్సన్ నాగకుమారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగకుమారి మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ముందుకు అడుగులు వేద్దామని తెలిపారు. అందుకు అధికారులూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని ఆశిద్దామని పేర్కొన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ చంద్రబాబు మాట్లాడుతూ పెడన పురపాలక సంఘానికి వచ్చే ఆదాయం అతి తక్కువగా ఉంటుందని, ఆదాయ మార్గాలపై దృష్టి సారించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ పెడన పురపాలక సంఘానికి ఆదాయం తక్కువగానే ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులపైనే ఆధారపడుతుందన్నారు. పారిశుద్ధ్య పనులను మెరుగుపరుచుకోవడానికి సిబ్బందిని కూడా అదనంగా నియమించుకోలేని పరిస్థితులు నెలకొన్నాయని స్పష్టం చేశారు. పరిస్థితులను అర్థం చేసుకుని అందరి సహాయ సహకారాలతో ఆయా సమస్యలను పరిష్కరించుకుంటూ పట్టణాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్దామని చెప్పారు. వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బి.జ్యోతి, ఫ్లోర్ లీడర్ భళ్ల గంగయ్య, మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర, కౌన్సిల్, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా విజ్ఞానం, నైపుణ్యం పెంపు

కలెక్టర్ పి.రాజాబాబు



గెలుపొందిన క్రీడాకారులతో కలెక్టర్ పి.రాజాబాబు చిత్రంలో ఎమ్మెల్యే పేర్ని నాని తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం):క్రీడల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. ఏపీ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ క్యారమ్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలకు కప్‌లు, నగదు బహుమతుల ప్రదానం లక్ష్మీ టాకీసు సెంటరులోని ఓ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యారమ్స్ క్రీడ ద్వారా ఎంతో నైపుణ్యం వస్తుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఈ క్రీడను అలవాటు చేసుకుంటే ఉన్నతస్థాయిలో ఆడేందుకు అవకాశాలు ఉంటాయని చెప్పారు. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. బందరు శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ క్యారమ్స్ క్రీడ రాను రానూ కనుమరుగవుతున్న నేపథ్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు మచిలీపట్నంలో నిర్వహించటం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. గతంలో జీవో నెంబరు 74 ద్వారా 13 క్రీడలను తొలగించబడ్డాయని వీటిలో క్యారమ్ ఒకటి ఉందన్నారు. తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి క్యారమ్ క్రీడను రాష్ట్ర స్థాయి, దేశ స్థాయిలోనూ నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. క్యారమ్ క్రీడ ద్వారా నైపుణ్యం పొందిన క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో ఉపాధి అవకాశాలు పొందలేకపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు వచ్చేలా తాను సీఎం జగన్‌తో చర్చిస్తానని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. అనంతరం క్యారమ్స్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన పి.జనార్దనరెడ్డి (వైజాగ్)కి కప్‌తో పాటు రూ. 10 వేలు నగదు, రన్నర్ స్థానంలో నిలిచిన ఎండీ సాధిక్ (గుంటూరు)కు కప్‌తో పాటు రూ. 8వేలు నగదు, మూడో స్థానంలో నిలిచిన వైఎస్‌డీ రమేష్ (వైజాగ్)కు కప్‌తో పాటు రూ. 6 వేలు నగదు, నాల్గవ స్థానంలో నిలిచిన బి.రవీంద్రరెడ్డి(గుంటూరు)కు కప్, రూ. 4 వేలు నగదు అందజేశారు. ఏపీ స్టేట్ ఫస్ట్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్ స్టేట్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ జలీల్, తహసీల్దార్ శ్రీవిద్య, జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల మురళీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, టోర్నమెంట్ ఉపాధ్యక్షుడు గౌర శ్రీహరి, ముచ్చర్ల వెంకటరత్నం పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశ్రమల స్థాపనపై అవగాహన



దరఖాస్తుదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ విజయలక్ష్మి

బంటుమిల్లి: కుటీర పరిశ్రమలు ఉన్న చిరు వ్యాపారులను సూక్ష్మ పరిశ్రమల స్థాయికి తీసుకువెళ్లడానికి ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి (ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు) పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం మంచిగా ఉపయోగపడుతుందని జిల్లా ఫుడ్ కార్పొరేషన్ సొసైటి ఈడీ జి. విజయలక్ష్మి తెలిపారు. మండల సమాఖ్య(వెలుగుభవనం) కార్యాలయంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని దరఖాస్తుదారులకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కుటీర పరిశ్రమలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులను మరింత ప్రోత్సహించి రాయితీపై బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి చిన్న తరహా పరిశ్రమల స్థాయికి ఎదిగేందుకు ఆర్థిక అండ కల్పించడమే ఈ పథకం ఉద్దేశమని చెప్పారు.

ఈ వ్యాపారాల ద్వారా మరి కొందరికి ఉపాధి అవకాశాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యాపారానికి తయారు చేసే అంచనాల్లో లబ్ధిదారుడు 10 శాతం పెట్టుబడి పెడితే ప్రభుత్వం బ్యాంకుల నుండి 90 శాతం రుణం మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 35 శాతం రాయితీ ఇస్తుందన్నారు. యూనిట్లు ఏర్పాటు చేసుకునే లబ్ధిదారులకు శిక్షణ, వ్యాపార ప్రోత్సాహం ప్రభుత్వం నుంచి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో పెడన ఏసీ కనకరావు, ఏపీఎం డి. శ్రీను, సీసీలు సత్యవర్ధన్, నాగేశ్వరరావు, తులసీబాల, లక్ష్మీతులసి, బుక్ కీపర్లు, గ్రామ సమైఖ్య సంఘాల సభ్యులు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు నిరసిస్తూ భారీ ర్యాలీ



చల్లపల్లిలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

చల్లపల్లి:మణిపూర్‌లో జరిగిన మారణహోమం, మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ నియోజకవర్గానికి చెందిన పాస్టర్లు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఘంటసాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ చల్లపల్లి మీదుగా మచిలీపట్నం వరకూ సాగింది. ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున పాస్టర్లు, వందలాది మంది విశ్వాసులు ఈ శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లపల్లిలో పలువురు పాస్టర్లు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా జరిగిన మణిపూర్ మారణహోమం, మహిళలపై అత్యాచారాలు భారతదేశ ప్రతిష్టను మంటగలిపాయని తెలిపారు. మహిళలను నగ్నంగా ఊరేగించి వారిపై సామూహిక అత్యాచారం చేయడం దారుణమైన విషయమన్నారు. జంతువుల కంటే హీనంగా వ్యవహరించిన ఈ ఘటనకు బాధ్యులైన అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అక్షయ డెవలపర్స్ చైర్మన్ మాదివాడ వెంకట కృష్ణ, రేపల్లెకు చెందిన ఐఆర్‌ఈఎఫ్ అధినేత రెబ్బా ఇమ్మానియేల్, గుడిసేవ ప్రదీప్‌కుమార్, మండలి కిరణ్, కోట ప్రసాద్, గోల్కొండ డేవిడ్, ప్రేమ్ కుమార్, సుందర్ సింగ్‌తో పాటు వందలాది మంది పాస్టర్లు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చటం అభినందనీయం

రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్‌చైర్మన్ నాగిరెడ్డి



అర్జీదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి

చిలకలపూడి(మచిలీపట్నం):స్పందన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తి తీర్చటం ఎంతో అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. కలెక్టర్ పి.రాజాబాబును కలిసే నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన స్వచ్ఛ కలెక్టరేట్ కార్యక్రమం ద్వారా ప్రతి సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇలా ప్రతి సోమవారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు సుమారు 300 మంది వరకు ఈ మజ్జిగ పంపిణీని చేపట్టడం శుభపరిణామమని చెప్పారు. ప్రతి సోమవారం స్వచ్ఛందంగా ఈ కార్యక్రమానికి సహకరించి మజ్జిగ పంపిణీ సజావుగా నిర్వహించేలా సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛ కలెక్టరేట్ ప్రతినిధి తూము వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు చిత్రంలో సలార్‌దాదా, వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్:నగరంలోని 15వ డివిజన్‌లో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సోమవారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలతో 161 మీటర్ల మేర నిర్మించనున్న రహదారి పనులను మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ పలు డివిజన్లలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గానూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం రూపొందించారని చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగానే 15వ డివిజన్‌లో పల్లంగా ఉన్న చర్మశిల్ప సెంటరు నుంచి 161 మీటర్ల మేర మెరక చేసి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. డెప్యూటీ మేయర్ శీలం భారతి, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్ దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, ఆ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ షహనాజ్ బేగం, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌లు మొహమ్మద్ రఫీ, షేక్ మొహమ్మద్‌సొహెబ్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ మతీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం):జైలులో శిక్ష అనుభవిస్తున్న వారు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. నగరంలోని సబ్‌జైలులో సోమవారం సాయంత్రం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఎక్కువగా గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులు ఉన్న నేపథ్యంలో న్యాయమూర్తి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి వినియోగం, అమ్మకాలు జరపటం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ కేసులో పట్టుబడితే తప్పకుండా శిక్షార్హులవుతారని చెప్పారు. ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని వారు తమ సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం న్యాయమూర్తి ఆరు నెలలకు పైబడి శిక్ష అనుభవిస్తున్న వారి వివరాలు తెలుసుకుని చార్జిషీట్ దాఖలు తదితర అంశాలపై పోలీసులతో చర్చించారు.

వెంటనే చార్జిషీట్ దాఖలు చేయాలని జైలు అధికారులకు సూచించారు. అనంతరం జైలు రికార్డులను పరిశీలించి ఖైదీలకు అందుతున్న వసతులు పరిశీలించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ పి. రమేష్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సీహెచ్ మునలయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే రైతులకు మేలు



మాట్లాడుతున్న నాయకులు

గూడూరు:ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలోనే రైతులు మేలు చేకూరిందని గూడూరు వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ పర్చం మహాలక్ష్మయ్యనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం టీడీపీ నాయకులు చేసిన విమర్శలకు అంకెలతో సహా బదులిచ్చారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఒక్క గూడూరు మండలానికి సంబంధించి 2019-20 సంవత్సరంలో రూ.10.61 కోట్లు, 2020-21 సంవత్సరానికి రూ.11.15 కోట్లు, 2021-22లో రూ.11.27 కోట్లు, 2022-23 సంవత్సరానికి ఇప్పటివరకు రూ.4.55 కోట్లు రైతు ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. కష్టం హైరింగ్ సెంటర్ల ద్వారా 98 మంది రైతులకు రూ.1.68 కోట్ల విలువైన యంత్ర పరికరాలు సమకూర్చితే అందులో ప్రభుత్వ సబ్సిడీగా రూ.56 లక్షలు మంజూరు చేసిందని వివరించారు. ఏటా రైతులకు క్రాప్ ఇన్సురెన్స్ చెల్లించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టం సంభవిస్తే అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనన్నారు. గతంలో తాము చేసిన పనులకు సంబంధించి ప్రభుత్వం రూ.52 లక్షల బిల్లులు బకాయిలు ఉన్నాయని టీడీపీ నేతల ఆరోపణలపై స్పందించిన ఆయన మీ చేతకానితనం వల్లే మీ ప్రభుత్వం అధికారంలో ఉండి కూడా బిల్లులు చేయించుకోలేకపోయారని విమర్శించారు. టీడీపీ నాయకుల మాటలు కోటలు దాటుతున్నాయన్నారు. ఏదో సినిమా డైలాగులు చెబితే వినడానికి వినసొంపుగా ఉంటాయని, వాస్తవాలు క్షేత్రస్థాయిలో రైతులను అడిగి తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితువు పలికారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచులు బొర్రా సాంబశివయ్య, ఐనాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కొల్లా బాలకృష్ణ, నాయకులు వేమూరి స్వామి, సోమరౌతు భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ జిల్లా సమన్వయకర్తగా రవికిషోర్



నియామక పత్రం అందుకుంటున్న రవి కిషోర్

మచిలీపట్నం టౌన్:గ్రామ, వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా సమన్వయకర్తగా తాళ్లపాలెం -1 సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ రవికిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాష ఆదేశాలు జారీ చేశారు. రవికిషోర్ ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శివ రెడ్డి నియామకపత్రాన్ని రవి కిషోర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రవికిషోర్ మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగుల సంక్షేమం కోసం తాను ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. రవి కిషోర్‌ను గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకుడు జానీ పాష, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, జిల్లా ఉపాధ్యక్షుడు కలపాల దినేష్ తదితరులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తోట్లవల్లూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని రైతు సాధికార సంస్థ అడ్వైజర్ డీవీ రాయుడు తెలిపారు. తోట్లవల్లూరులో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పొందటానికి అవకాశం ఉంటుందని చెప్పారు. పార్థసారథి, నాగమల్లీశ్వరి, వెలుగు కృష్ణంరాజు పాల్గొన్నారు.